# అస్థిపంజరం

శర్మ జీపువేసుకుని రేవుదగ్గరకొచ్చాడు. మధ్య దారిలో యింజను చెడిపోయిందోఏమో, అనుకున్న సమయానికి లాంచి వొడ్డుకు రాలేదు. ఒడ్డుకు కొద్ది దూరంలో చెట్టుకింద జీపును ఆపి, తాపీగా సీటుకు జారబడి సిగరెట్టు కాలుస్తూ కూచున్నాడు.

శర్మ గవర్నమెంటు డాక్టరుగా పనిచేస్తూ, స్కాలర్‌షిప్ మీద విదేశాలకు వెళ్ళి ఒక ఏడాదిపాటు వుండి వచ్చాడు. తిరిగి వచ్చిన నాలుగు నెలలకే మన్యం ప్రాంతంలో మలేరియా ఆరికట్టేందుకై అతన్ని వేశారు. ఇద్దరు అసిస్టెంటుల్లు, ఒక జీపు, కొండమీద చక్కటి బంగళా, డిస్పెన్సరీకి అవసరమైన సామాను, ఇద్దరు నర్సులు, నలుగురు పనివాళ్ళు-హోదాకు తగ్గ వుద్యోగం.

ఏకాంతం అనుకోకపోతే అంతా ఒక అందమైన జీవితం. పట్టణంలోలా రైళ్ళూ, కార్లూ, జనం గుంపులూ, క్లబ్బులూ, సినిమాలూ, రకరకాల వినోదాలూ యిక్కడ లేకపోయినా ఎత్తయిన కొండలూ, కొండలమీద మేత మేయడానికి వాలే నల్లటి మబ్బుల గుంపులూ, లోతుగా యిరుగ్గా కొండలమధ్య అగాధాలూ, నున్నగా సూదిగా ఆకాశంలోకి చొచ్చుకుపోయిన కొండ శిఖరాలూ, వాటిమీద కొండనంతటినీ ఆకుపచ్చ చీరతో చుట్టేసినట్టు పచ్చగా పసుపుగా ఎత్తయిన చెట్లూ, విరిగి లోయలోకి జారిన బండరాళ్ళూ, మెలికలు మెలికలు తిరిగి పరుగెడుతూ ఎక్కడికక్కడే ఆఖరైపోయి మళ్ళీ ఏ రాళ్ళ సందుల్లోనో పుట్టి అల్లంత దూరంలో మాయమయ్యే పిల్లకాలువల్లూ, జీపుపోతూంటే అడ్డంగా చెంగు చెంగున దూకుతూ పారిపోయే లేళ్ళూ, జింకలూ, చెవులు నిక్కబొడుచుకుని దొంగచూపులు చూస్తూ దూకుతూపోయే తెల్లని బొద్దు కుందేళ్ళూ, కొమ్మ కొమ్మనా నిలిచి పిలిచి పలకరించే రకరకాల పక్షులూ—యివన్నీ యీనాటి పట్నవాసాన్నీ, వాటి మనుషుల్నీ మరిపించి జీవితాంతం అక్కడే పడుండేలా చేస్తాయి. ప్రకృతిని ప్రేమించేవాడికి అదంతా ఒక స్వర్గంలా అనిపిస్తుంది.

శర్మను ఆ ప్రకృతీ, అక్కడి అలవాట్లూ విశేషంగా ఆకర్షించాయి. నల్లని కొండచరియలు, తెల్లగా నల్లగా ఎగిరే మేఘాలు, పచ్చగా పసుపుగా దూరానికి నీలంగా కనిపించే చెట్లు, లావుగా సన్నగా కొండలమీద నుండి బండల పక్కనుండి పాములా మెలికలు తిరుగుతూ పరుగెత్తి కదిలి దూకి ఒకొకప్పుడు పొంగి పొరలి మరొకప్పుడు నిశ్చలంగా పరుగెత్తే కొండ కాలువలు, ఒకచోట గుంపుగా పదీ పదిహేను పూరిపాకలు అతనికి చాలా సన్నిహితమై పోయాయి. రోజూ శర్మ జీపువేసుకుని ఆ ప్రాంతాలన్నీ తిరిగి అక్కడివాళ్లకు ఇంజక్షన్లనీ, మందుల్నీ, సలహాలనీ యిస్తుంటాడు.

శర్మ పూర్తిగా మారిపోయాడంటే ఆశ్చర్యపడక్కర్లేదు. ఆ ప్రకృతే అలాటిది. అక్కడి ప్రకృతీ, అతని చుట్టూ వున్న పరిస్థితులూ అతన్నలా మార్చేశాయి. తనలో వచ్చిన మార్పును తలచుకుంటుంటే ఒక్కొక్కప్పుడు అతనికే ఆశ్చర్యం వేస్తూవుంటుంది. విదేశాలు తిరిగి వచ్చినవాడేనా తను అని విస్తుపోతుంటాడు.

ఏ వ్యక్తయినా విదేశాలు తిరిగొచ్చాడని చెప్పుకోవడానికి పట్నం మంచి పబ్లిసిటీ యిస్తుంది. కార్లూ, నలగని ఊలెన్ సూట్లూ, సన్మానాలూ, పత్రికలూ, పెద్దలతో పరిచయాలూ, పరాయి భాషలో పలకరించి మాట్లాడు కోడానికి మిత్రులూ మనిషి విదేశాలు తిరిగివచ్చాడని చాటడానికి తోడ్పడ తాయి. కాని యిక్కడ యీ కొండల మధ్య లోయల్లో ఎక్కడో మైలు దూరంలో పదీ పదిహేను మంది వుండే యీనిర్జన ప్రదేశంలో అతను ఏ ఏ దేశాలు తిరిగేడో, జీతం ఎంతో తెలుసుకోవలసిన అవసరం ఎవరికీ వుండదు. అక్కడివాళ్ళకు కావలసిందల్లా అతను మందు యిస్తున్నాడా? అది గుణం యిస్తున్నదా అని.

నిజానికి ఆ ప్రాంతంలో వాళ్ళెవరూ అతని దగ్గర మందు తీసుకోరు. ఇంగ్లీషు మందులూ-సూది మందులూ వారికి యిష్టంలేదు. ఏ జబ్బొచ్చినా నాలుగాకులు తెచ్చుకుని నాలుగువేళ్ళు తవ్వుకుని నములుతారు. మరోవ్యాధి అయితే ఎవరూ అతన్ని లెక్కచేయరు ఒక్క మలేరియా తప్ప. అదీ అక్కడి కోయజాతి వారినీ, అడవిజాతి వారినీ ఏమీ చెయ్యలేదు. ఇప్పుడిప్పుడు కొత్తగా జనం పట్నం నుండి ఎగబాకి వ్యాపారం సాగిస్తున్నారు. వాళ్ళకు మలేరియా తగులుతోంది. దాన్ని అరికట్టడానికి అతన్ని వేశారు.

కొండోళ్ళతో మాట్టాడడమంటే సులభమేంకాదు. ఒక పట్టాన వాళ్ళకు అర్థంకాదు. అతను ఇచ్చే మందులు తాగడానికి వాళ్ళు వొప్పుకోరు. వాళ్ళకు నెమ్మదిగా నచ్చజెప్పాలి. వాళ్ళతోపాటు కూర్చుని అప్యాయంగా మాట్లాడాలి. వాళ్ళను నవ్వించాలి. వాళ్ళమధ్య కలిసి గుడిసెల్లోనూ. నేలమీదా కూచోవాలి. విదేశం వెళ్ళొచ్చానన్న గర్వం పనికిరాదు. వాళ్ళతోపాటు తనూ ఒక్కడై నవ్వుతూ నవ్విస్తూ తిరుగుతూ, వాళ్ళు తీసుకెళ్ళిన చోటికిపోతూ, వాళ్ళ మోటు సరసాల్నీ వేళాకోళాల్నీ భరిస్తూ వుండాలి.

శర్మకు అవన్నీ అలవాటయిపోయాయి. నిజంగా అతను ఆ ప్రకృతితోనూ, అక్కడివాళ్ళతోనూ కలిసిపోయాడు!

అక్కడి ప్రకృతినీ, ప్రజల్నీ వివరిస్తూ శర్మ పట్నంలో వున్న మిత్రులిద్దరికీ వుత్తరాలు రాస్తూండేవాడు. రెండేళ్ళకి ఒకరోజు యిద్దరూ కలిసి వస్తున్నారని ఉత్తరం వచ్చింది.

ఒకడు సత్యం.

రెండోవాడు శివం.

ఇద్దరూ, ప్రకృతి అందాన్ని సొంతంచేసుకోవాలని ఆసౌందర్యంముందు గుడ్లప్పగించి కూచుని గడగడా మంచినీళ్లుతాగినట్టు అందాన్ని కళ్ళతో తాగేసేవాళ్ళే! ప్రకృతి అందాన్ని ప్రేమించినట్టు స్త్రీని కూడా ప్రేమించలేరేమో! స్త్రీలో అందం వుండొచ్చు. అది లేకపోయినా మోహం అందాన్ని సృష్టిస్తుంది. మోహం లేకపోతే స్త్రీలో ఆకర్షణ ఏదీ?

మరి ప్రకృతి అలాకాదు. దాని అందంలో ఆకర్షణ వుంది. రోజుల పాటు నిద్రాహారాలు మానిపించి కూర్చోబెట్టే శక్తి వుంది. మానవుణ్ని మహా సౌందర్యంముందు అల్పుడ్నిచేసి తనముందు మోకరిల్లజేసుకునే మహత్తువుంది. ఇవి అందర్నీ కదపలేకపోయినా సత్యం, శివం లాటి వారిని మాత్రం వూపి పారేస్తాయి. వాళ్ళ ఆలోచనల్ని పునాదుల్తోసహా కదిలించేస్తాయి.

గీతల్లో ఆకారాల్నీ పోలికల్నీ తెప్పించి, కళ్ళముందు ప్రకృతిని కృత్రిమంగా సృష్టించి, సృష్టికి ప్రతిసృష్టి చెయ్యగల చిత్రకారుడు-సత్యం.

దాని సౌందర్యాన్నీ సోయగాన్నీ వర్ణించి, వినిపించి, మారుమూలలకు కూడా దాని ప్రాముఖ్యతను ఎలుగెత్తిచాటే కవి-శివం.

ఇద్దరూ కలిసి ఫలానానాడు వస్తున్నామని వుత్తరం రాశారు. మిత్రుల్ని తీసుకెళ్దామని శర్మ జీపు వేసుకుని వచ్చాడు. లాంచి యింకా రాలేదు. జీప్‌లో కూచుని ఆకాశంలో మేఘాలు పీల్చేసిన పల్చని వెలుగు తడినీ, చెట్ల గుబురుల్లోనూ, కొండల దిగువ లోయల్లోనూ పేరుకుంటోన్న చీకటినీ చూస్తున్నాడు.

లాంచి వస్తోన్న శబ్దం సన్నగా వినిపించింది. లేచి గట్టుమీదికొచ్చి నుంచున్నాడు. లాంచి వస్తోంది. బుడ బుడా నీటిని శబ్దంచేసుకుంటూ లాంచీ వొడ్డుకొచ్చి ఆగింది. అలలు, గట్టుమీద తాపిన రాళ్ళనూ, గట్టువదలి నీళ్ళలోకి దిగిన చెట్లవేళ్ళనూ కదిపి శబ్దంచేసి మాయమయ్యాయి.

సత్యం, శివం లాంచీ దిగొచ్చి మిత్రుడ్ని కావలించుకున్నారు. ఆప్యాయంగా పలకరించుకున్నారు. చా లా సే పు అక్కడే నిలుచుని మాట్లాడుకున్నారు.

ఆ తర్వాత ముగ్గురూ వెళ్ళి జీపు ఎక్కారు. శర్మ డ్రైవ్ చేస్తున్నాడు. వెనకసీట్లో సత్యం, శివం కూచుని పరిసరాల కేసి చూస్తున్నారు. చీకటిలో వాళ్ళకు కనిపించేదేమీలేదు. అయినా ప్రకృతి చీకటిచీర చుట్టుకుని ఎంత భయంకరంగా, గంభీరంగా వున్నా అదికూడా ఓ సౌందర్యమనే వాళ్ళ వాదం.

చూపుల్ని తమలో విలీనంచేసుకుని, ఆశ్చర్యాన్నీ ఆనందాన్నీ కలిగించి భావాలనూ బుద్ధినీ స్తంభింప చేసేదే సౌందర్యం. చీకటికూడా ఎంత అందంగా వుంటుందని! మనకళ్లకు దాని అందం కనిపించదుకానీ కనిపిస్తే అందాన్ని భరించలేక, ఆ చీకట్లో పరుగెత్తి దొర్లి ఏడవాలనిపిస్తుంది. గబ్బిలాలూ, పెద్దపులులూ, పిల్లులూ ఎంత అదృష్టం గలవి! ఆ అదృష్టం మనకులేదు. చీకటంటే మనకు అసహ్యం, భయం. దాన్ని చీదరించుకుంటాం. అక్కడ్నించి ఏ వెలుగునో వెతుక్కుంటూ పారిపోతాం. వాటికాబాధలేదు. చీకటిలోనే స్వేచ్ఛగా, ఆనందంగా, తృప్తిగా తిరుగుతాయి అందాన్ని అనుభవిస్తూ.

జీపు హెడ్‌లైట్లు చీకట్లను చీల్చుకుని ముందు కొద్ది మేర వెల్తుర్ని సృష్టిస్తున్నాయి. కొండల కిందనుండి, పెద్ద బండరాళ్ళ ప క్క నుం డి, లోయల్లోనుండి ఎత్తయిన గుట్టలమీది నుండి సన్నని కంకరబాట ఒకటి

బండివెళ్లే వెడల్పులో వుంది. కొద్దిదూరం పోయాక కంకరబాట ఆఖరైపోయి దాన్ని కలుపుతూ మట్టిబాట వుంది. కుదుపుల్తో ఎగిరిపడుతూ ఆ బాటలోంచి పోతోంది జీపు. మధ్య మధ్య చెట్ల కొమ్మలూ, రాళ్ళూ జీపుని రాసుకుంటు న్నాయి. పక్కకు దిగితే మళ్ళీ కనిపించనంతటి అగాధాలు ఒకవైపూ, జీపు టాపుమీదకి వంగి ఏ క్షణంలోనన్నా మీద పడబోయేటట్టు కొద్దిపాటి ఆధారంమీద ఆనుకున్న బండరాళ్లు మరోవైపూ వున్నాయి. మెడ తెగగొట్ట డానికి తీసుకుపోతున్న మేకపిల్లలా వెళ్ళలేక వెళ్ళలేక లోపలి ప్రాణాల్ని గుప్పెట్లో పెట్టుకుని వెళ్తోంది ప్రాణంలేని ఆ యంత్రం.

నాలుగైదు కుందేలు పిల్లలూ, జింక పిల్లలూ వెలుతుర్ని చూసి ప్రళయం వచ్చిపడ్డట్టు అడ్డంగా విరిగిపడ్డ చెట్ల కొమ్మల్నీ, బండరాళ్లనీ చెంగు చెంగున దూకుతూ దాటుతూ చీకట్లో కలిసిపోయాయి. ఒకటి రెండు రాళ్ళు దొర్లుకుంటూ వచ్చి జీపుపక్కనేపడి కిందవున్న కాలవలోకి జారిపోయాయి. ఎవరూ ఏమీ మాట్లాడ్డంలేదు. ఎవరేమన్నా శర్మ నిశ్చలత చెదిరి జీపు ఏమైనా కావచ్చు. సౌందర్యంలో కూడా భయం వుందన్న సంగతి ఆలోచిస్తూ ఊపిరి బిగబెట్టి కూర్చున్నారు.

దారిలో గూడెం ఒకటి తగిలింది. బాటపక్క పదీ పదిహేను పూరి పాకలు అక్కడక్కడ అంతంత దూరంలో వున్నాయి. ఇళ్లల్లో దీపాలులేవు. దగ్గర్లోనే చిన్నమంటను వెలిగించి, దానిచుట్టూ కోయవాళ్లు కొందరు పాడుతూ ఆడుతున్నారు. మోటుగా, బలంగా వున్న ఆడాళ్లూ, మగాళ్లూ ఒకళ్లతో ఒకళ్ళు సరసాలు ఆడుతూ తూగుతూ తోసుకుంటూ గెంతుతూ తరుముకుంటున్నారు. ఆడాళ్ళ వొంటిమీద బరువెక్కువే వుంది. మెడలోనూ, చేతులకూ, దండలకూ పూసలూ, వేర్లూ, ఇత్తడివీ రాగివీ గొట్టాలూ జారిపోతూ వేలాడుతున్నాయి. చేతుల్తో నడుములు పెనవేసుకుని మంటచుట్టూ గుండ్రాకారంలో నిలుచుని నిశ్శబ్దాన్ని నవ్వుల్తో, అరుపుల్తో విరుస్తూ చలికాచుకొంటున్నారు. గుంపులోని పిల్లకాయలు జీపుశబ్దం వినడంతోనే పరుగెత్తుకొచ్చి బాటకు అటూ యిటూ నుంచుని చప్పట్లు చరుస్తున్నారు. పెద్దాళ్ళు ఎగాదిగా జీపును చూసి మళ్ళీ యధావిధిగా ఆడుతూ పాడుతూ తమపనిలో తాము మునిగిపోయారు.

"ఎంత బలంగా, మోటుగా ఉన్నారో!" అన్నాడు సత్యం.

"ఎంత ఆనందమైన జీవితం! విచారంలేని బ్రతుకులు సుమీ!" అన్నాడు శివం.

రెండింటికీ ఊ కొట్టాడు శర్మ.

వాళ్ళ పాటలూ, వాళ్ళ కేరింతలూ ఆ కొండ లోయల్లో, ఆ రాళ్ల మధ్య, అక్కడి చెట్ల అడుగున, ఆ కాలవ నీళ్ళల్లో ప్రతిఫలిస్తున్నాయి. జీపు వాళ్ళకు దూరమైపోయింది. క్రమ క్రమంగా అవీ సన్నగిల్లాయి. నిశ్శబ్దంలో అన్ని శబ్దాలూ కరిగిపోయి ప్రకృతిలో నిశ్చలత తొంగిచూస్తోంది.

జీపు, లోయలాంటి దాన్ని దాటి చిన్న పచ్చిక బయలు ప్రదేశంలోకి వచ్చింది. కోయవాళ్ళు వ్యవసాయంచేసి సారం తగ్గిపోతే వదిలేసిన ప్రదేశం అది. దానికి వందగజాల దూరంలో ఒకవైపున కొండలాంటి ఎత్తు ప్రదేశం వుంది. దానిమీద ఒక బంగళా వుంది. లోన హరికెను దీపాలు వెలుగుతున్నాయి. నడవాలో మాత్రం పెట్రొమాక్సు లైటు తెల్లగా వెలుగుతోంది. బార్లా తెరిచిన కిటికీ సందులోనుండి వెలుతురు కొండకింద కాలవ నీళ్ళల్లోపడి వెండిలా తళతళలాడుతున్నాయి నీళ్లు. ఆ యింట్లో నడవాలో, బయట బంగళాపక్క చెట్టుకింద గుబురుల్లో మనుషుల అలికిడి కనిపిస్తోంది. జీపు, చుట్టూ తిరిగి బంగళా చేరుకుంది. మిత్రులు ముగ్గురూ జీపుదిగి నడవాలోకి నడిచారు.

భోజనాలయ్యాక ముగ్గురూ బంగళాని ఆనుకున్న పెద్ద రాతి బండ మీద కూచుని సిగరెట్లు కాల్చుకుంటున్నారు.

"ఎలావుంది యీ చోటు?" అన్నాడు శర్మ.

"నన్ను యిలాంటి చోటగాని వదేస్తే నగర నాగరికుడి పాద స్పర్శే తగలని యీ ప్రదేశాల్నీ, చెట్లనూ, యీ కదిలే కాలవల్నీ, పక్షుల్నీ బొమ్మలుగీసి, స్త్రీ వంటి మీద యితరులకు కనిపించకుండా దాచిన భాగాల్లా సృష్టిలో దాగిన యీ మారుమూల సౌందర్యాన్ని అందరికీ బాహాటంగా బట్టబయలు చేసేవాడిని. ఇక్కడ కూర్చుంటే తయారైన లేండ్‌స్కేపుల్ని ఏ లండన్ ఆర్ట్ థియేటర్‌లోనో ప్రదర్శిస్తే ఫస్ట్‌ప్రైజ్ వచ్చితీరుతుంది. ఇదిగో యిక్కడ యీ కాలవ వడ్డున నీళ్ళల్లో పాదాలలోతున

నిలుచుని కడవెత్తుకుంటూ ఓ స్త్రీ వుంటే యీ ప్రదేశం యింకెంత కళకళలాడుతుందోగదా! రాత్రివేళే యిది యింత అందంగావుంటే పగలు మరింకెంత అందంగా వుంటుందో! నిజంగా నువ్వు అదృష్టవంతుడవోయ్ శర్మా! ఇలాంటి ప్రకృతి మధ్య నువ్వుంటున్నావంటే నాకెంత అసూయగా వుందో తెలుసా" అన్నాడు సత్యం.

చిన్నగా చిరునవ్వు నవ్వాడు శర్మ. "మరి నీకెలా వుంది?" అన్నాడు శివంవైపు తిరిగి.

"నేను యింతవరకు యిలాంటి సౌందర్యాన్ని ఎవరో చెప్పగా వినడమే గాని ప్రత్యక్షంగా చూడలేదు. ఈ చెట్ల ఆకులు ఎంత అందంగా శబ్దంచేస్తూ కదులుతున్నాయి! అగాధాల్లా నీలంగా కళ్ళూ, వక్షాలమధ్య చంద్రహారంలా కొండలమధ్య లోయలో పిల్లకాలువా, స్నానంచేసి తలారబోసినట్టు ఆకాశంలో నల్లని చీకటీ- వీటిమధ్య కూచుని కలంపట్టుకుంటే ఓ మహాకావ్యాన్ని సృష్టించకపొయ్యేవాడినా. ఇక్కడో ప్రణయఘట్టం- యిద్దరు ప్రియులు కలుసుకోవడమో, విడిపోవడమో, తెగించి నీళ్ళలోకి దూకి చావడమో ఏదో ఒకటి జరిగితే ఎంత నిండుదనం, ఎంత కళా యీ ప్రదేశానికి వస్తాయి! నువ్వు కేవలం అనుభవించి ఆనందిస్తున్నావేగాని నేనయితే ఇక్కడ కాలంలో కరిగిపోయిన చరిత్రను -ఈ నీళ్ళల్లో, యీ రాతిమీద, యీ గడ్డిలో, యీ కొండలపైన, యీ లోయల్లోపల వెన్నెల రాత్రిళ్ళు, చీకటి రోజులు రహస్యంగా కలుసుకున్న ప్రియుల్ని లోకానికి చాటి; వాళ్ళ ధైర్యానికి అభినందననూ, వాళ్ళ ప్రేమకు ఫలితాన్నిబట్టి సానుభూతినో, సంతోషాన్నో యిప్పించే వాడిని. నువ్వు నిజంగా చాలా అదృష్టవంతుడవోయ్ శర్మా! ఒక విధంగాచూస్తే డాక్టర్లు ప్రకృతిని ప్రేమించలేరు. దయా దాక్షిణ్యాలు, పాపం, భయం, సౌందర్యం వాళ్ళను ఎక్కువగా కదిలించలేవు. సృష్టిని చంపడం అతనికి కష్టంకాదు. సౌందర్యాన్ని నిర్దయగా, పాపపుణ్యాల ప్రమేయం లేకుండా నాశనం చేస్తాడు. అందమైన స్త్రీ రూపాన్ని చూస్తే అతనికి కనిపించేది బాహ్యరూపంకాదు- లోపల వికారంగా రక్తం, ప్రేవులు, జబ్బులు, పురుగులు, సన్నని ఎముకల పోగుల అస్థి పంజరం! కానీ నువ్వు డాక్టరువే

అయినా అందుకు విరుద్ధంగా మారిపోయావు. ఇది చాలా ఆశ్చర్యకరమైన విషయం. ఇది వాళ్ళలోనూ దయా, ప్రేమా, అభిమానం వుందని నిరూపంచడం గాబోలు."

శర్మ మళ్ళీ తనలోతాను నవ్వుకున్నాడు. ఆ నవ్వుకు శృతిగా ఎక్కడో ఓ పిట్ట కూసింది. కొండల్లోయల్లో ఆ నిశ్శబ్దంలో ప్రతిధ్వనించిందది.

శర్మ చెప్పాడు.

"నేనిలా మారిపోవడం నాకు కూడా చాలా ఆశ్చర్యంగానే అనిపిస్తూ వుంటుంది. కారు మీద తప్పితే కదిలేవాడిని కాదు. పరివారం వుంటేగాని అవతలకు అడుగుపెట్టేవాడిని కాదు. ఈనాడు ఆ పట్టుదలా, ఆ గర్వమూ ఏమయ్యాయో తెలీదు. కొండేసి మైళ్ళు తుప్పల్నీ, గుట్టల్నీ, నీళ్ళ చారల్నీ దాటుకుని నడిచి వెళ్ళడం అంటే నాకిప్పుడు చాలా యిష్టం. జీపు వున్నా మరీ దూరమైతేగాని దానిమీద వెళ్ళను. ఇక్కడి వాళ్ళతోపాటు నేలమీదో, రాతిమీదో, గడ్డి పైనో కూచుని మాట్లాడుతూ, వాళ్ళతో కలిసి తిరుగుతూ వాళ్ళు తెచ్చిచ్చిన పళ్ళనీ, దుంపల్నీ తీసుకుని, వాళ్ళలా పచ్చివీ, కాల్చినవీ తింటూ ఒక రకంగా వాళ్ళలో కలిసిపోయాను. నేను వెళ్ళేటప్పటికి చిన్నపిల్లలు నా చుట్టూ చేరిపోయి నా కోటునీ, నా సంచినీ పట్టుకుని వేళ్ళాడుతూ, భుజాలు రాసుకుంటూ చుట్టూ గెంతుతుంటారు. నిజానికి నన్ను యిక్కడ వెయ్యకపోతే నేనిలా అయ్యేవాడినే కాదు. ఇందాక నువ్వన్నట్టు దయా దాక్షిణ్యాలు లేని రసహీనమైన గుండెనాది. కాని అది కరిగిపోయింది. నాచుట్టూ వున్న ప్రకృతే నన్నిలా మార్చేసింది. సౌందర్యం అనేది కేవలం సినిమాల్లోనూ, తారల మొఖాల్లోనూ, పట్నాల్లో టిప్ టాప్‌గా తిరిగే పాశ్చాత్య నాగరికతకు సరికొత్త కార్బను కాపీల్లాంటి స్త్రీలలోనూ కాదు వుండడం. పంచభూతాలూ కలిసి తాపీగా విశ్రాంతి తీసుకుంటున్న యిలాటి నిశ్శబ్ద వాతావరణంలోనే అందంవుంది. పనికిరాని మట్టి తునకా, జారిపోయే నీటి చుక్కా, పొద్దున్న ఎదురొచ్చి ముఖంఎత్తి పలకరించి దాటిపోయిన పిల్లగాలీ, కొండ శిఖరంమీద గుచ్చుకున్న ఎర్రని సూర్యకిరణం విడివిడిగా గుర్తింపు పొందకపోయినా యివన్నీ కలిస్తే ఎంత అందాన్ని సృష్టిస్తాయి!"

ముగ్గురూ చాలాసేపు ఆ రాతిమీదనే కూచుండిపోయారు. ఎంతసేపయిందో తెలీదు. కబుర్లతో కాలాన్నే మర్చిపోయారు.

దూరంగా ఒక కొండపైన చిన్న వెలుగు లేచి పెద్దమంటై ఆ ప్రదేశమంతా ఎర్రగా చీకట్లను దూసుకుంటూ మండిపోతోంది. తెల్లటి పొగలు మెలికలు మెలికలుగా ఆకాశంలోకి వ్యాపిస్తున్నాయి. ప్రకృతి ప్రశాంతతని భంగపరుస్తూ పక్షులు అరుస్తూ ఎగురుతున్నాయి.

సత్యం శివంలు ఆశ్చర్యంగా అటు చూస్తున్నారు. "మరేంలేదు ఏ ఎలుగ్గొడ్డునో భయపెట్టడానికి మంటేస్తున్నట్టున్నారు కోయవాళ్లు. అలాంటివి యిక్కడ తరచు కనిపిస్తూనే వుంటాయి. మీలాటి క్రొత్తవాళ్ళకి అది ఏ కార్చిచ్చో అనిపిస్తుంది" అన్నాడు శర్మ.

ముగ్గురూ ఆఖరిమంట చివరి వెలుగు చిక్కటి చీకటిలో కరిగి యింకిపోయేవరకు చూచుని నిద్రపోదామని లేచారు.

ఉదయం లేచేసరికి ప్రకృతి చక్కగా సింగారించుకుని ఎదుట నిల్చునివుంది. తలలో ఎర్రగన్నేరులా మద్దిచెట్ల గుబురుల్లోనుండి సూర్యుడు తొంగిచూస్తున్నాడు. కిటికీలోంచి చూస్తే గుట్టలూ, కొండలూ, అగాధాలూ, కాలువలూ అందంగా మృదువుగా పచ్చగా కనిపిస్తున్నాయి. కొండ శిఖరాల్లాంటి వక్షాల్ని కప్పుతూ ఆకుపచ్చని రంగుచీర పరచుకుని వుంది.

ఎక్కువసేపు నిద్రపోవాలనిపించలేదు వారికి. తొందరగానే లేచి స్నానపానం పూర్తిచేసుకున్నారు. కాస్సేపు అలా కొండలమీద తిరిగివద్దామన్నారు.

శర్మ చిన్న అభ్యంతరం చెప్పాడు-రేపు ముగ్గురం కలిసి జీపుమీద అడివంతా తిరిగొద్దామని.

"పోనీ యివ్వాల్టికి మేం యిద్దరం అలా తిరిగొస్తాంలే" అంటూ కాగితాల కట్టల్తో ఫ్లాస్కుల్ని భుజాన వేలాడేసుకుని బయలుదేరారు సత్యం, శివంలు.

వాళ్ళు వెళ్తున్నప్పుడు "జాగ్రత్త సుమా" అని హెచ్చరించాడు శర్మ.

'అలాగే' అని చెప్పి బయలుదేరి హుషారుగా కొండల్నీ గుట్టల్నీ ఎక్కుతూ, దిగుతూ, కాలువల్లో మోకాళ్ళ నీటిలో దిగి నడుస్తూ అడవిలో నుండి, లోయల్లోనుండి గెంతుతూ, పరుగెడుతూ అనుకోకుండా రెండు మైళ్ళ దూరం నడచిపోయారు.

చిన్న కోయగూడెం తగిలింది. కొత్త మనుషుల్ని అక్కడి వాళ్ళు విచిత్రంగా చూస్తూ దగ్గరకు చేరారు. వాళ్ళను దాటుకొని మళ్ళీ నడక సాగించారు వారిద్దరూ. మధ్యాహ్నమయింది సూర్యుడు నడినెత్తి మీదకు వచ్చాడు. ఇక నడవలేక గుంపుగావున్న దేకుచెట్లమధ్య నీడల్లో కూచున్నారు. అప్పటికి ఫ్లాస్కులో సగం కాఫీ అయిపోయింది. మిగతాదికూడా కాళీచేసి సిగరెట్లు వెలిగించారు.

దారిలో వస్తూ సత్యం కొండల్నీ, చెట్లనీ, అక్కడి కోయవాళ్ళనీ గీచిన స్కెచ్‌లన్నిటినీ ఓమారు తీసి చూసుకున్నాడు. ఓ స్త్రీ బండమీద కూచుని తల ముడిపెట్టు కుంటోంది. ముందుకు పొడుచుకొచ్చిన ఆమె వక్షం కుడివైపు చంక కిందనుంచి అవుపిస్తోంది. ఆ బొమ్మను అక్కడక్కడ దిద్ది శివంకు చూపించాడు. బావుందన్నాడు శివం. తనుకూడా చూసిన ఆ ఆడ మనిషి అందాన్ని గురించి పావుగంట సేపన్నా పొగిడాడు.

అక్కడకు కొద్ది దూరంలో చిన్న కాలవవుంది. ఆ కాలవలో ముఖం కాళ్ళూ చేతులూ కడుక్కొని మళ్ళీ కాలవ వడ్డు వెంబడే బయలుదేరారు. కొద్ది దూరం వెళ్ళగానే కాలవలో నీళ్ళు కనిపించలేదు. అర ఫర్లాంగు దూరంలో మళ్ళీ నీళ్ళు తగిలాయి. జల ఎక్కడి కక్కడే వూరుతూ ఆఖరవుతూ వెళ్ళే కొలదీ కాలవ యింకా లోయల్లోంచీ, చెట్ల వేరుల కిందనించీ, బండరాళ్ళ పక్కనుంచీ లాక్కుపోతోంది. ఉత్సాహంతో చాలా దూరం వెళ్ళిపోయారు వాళ్ళు. అకస్మాత్తుగా వాళ్ళకి బంగళా జ్ఞాపకాని కొచ్చింది.

చుట్టూ చూశారు. బంగళా కనిపించడంలేదు. వాళ్లు మాత్రం లోయలో నుంచున్నారు. చుట్టూ కొండలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొండ శిఖరాలు తలమీదకు వంగి చూస్తున్నాయి. పెద్ద వర్షం వస్తే నీళ్ల ఆ లోయని ముంచి వాళ్ళను మళ్ళీ కనిపించకుండా చెయ్యొచ్చు. అడవిలోంచి పారిపోయొచ్చిన ఏ చిరుతపులన్నా వాళ్ళమీద అమాంతం విరుచుకపడొచ్చు. కొండ ఎక్కటోయి కాలుజారి పడితే ఆకారంకూడా తెలీకుండా ఎముకల పోగులా కావచ్చు. రక్షించేవాళ్ళెవరూ లేరు. అరిచినా అది వాళ్లకుతప్ప మరొకరికి వినిపించదు. తమ సంగతి యింటికి చేరేసేవాళ్ల యినా వుండరు. నికృష్టపు చావు చావాల్సి వస్తుంది.

వాళ్ళిద్దరకూ భయం వేసింది.

వెనక్కు తిరిగి వెళ్ళిపోదామని బయలుదేరారు.

లోయలో సన్నని యిరుకుబాట వెంట వెళ్లి ఓ పెద్ద బండరాయిని దాటుతూ చటుక్కున ఆగిపోయాడు సత్యం. శివంకు కూడా ఆశ్చర్యం వేసింది.

ఎదురుగా బండకింద అస్థిపంజరం.

దగ్గర్లో అక్కడక్కడా ఒకటి రెండు గుడ్డపేలికలూ, చెదిరిపోయిన పూసలూ, గాజుపెంకులూ వున్నాయి. ఎంతకాలంనించి అది అక్కడవుందో తెలియదు, వట్టి ఎండిపోయిన ఎముకలు తప్ప మాంసంగాని, రక్తంగాని లేదు. ఎండకు ఎండుతూ, వర్షానికి తడుస్తూ ఎప్పటినుండో అలా పడివున్నట్టుందది.

'అసలు యిదిక్కడి కెలా వచ్చింది?' అన్న ప్రశ్నకు యిద్దరకూ జవాబు దొరకలేదు. ఇలాంటి ఏకాంత ప్రదేశంలో మనుషుల అలికిడే వుండనిచోట అస్థిపంజరం ఎలావచ్చింది? ఏ పెద్దపులో, మరో జంతువో లాక్కొచ్చినట్టు ఆధారాలు కూడా లేవు. ఎముకలు ఎక్కడివక్కడే వున్నాయి. ఏ నీళ్లలోనో కొట్టుకొచ్చి వుండాలిగాని మరోవిధంగా అది అక్కడకు వచ్చే మార్గం లేదు.

మెల్లగా అడుగుల్లో అడుగులు వేసుకుంటూ యిద్దరూ దాని పక్కకు చేరారు. సత్యం ఆ అస్థిపంజరాన్ని కాలితో అటూ యిటూ కదిపి దాన్ని స్కెచ్ గీశాడు. శివం ఆ అస్థిపంజరాన్నే చాలాసేపు పరిశీలనగా చూసి "ఆడదై వుండాలి" అన్నాడు.

సత్యం తల వూపాడు. "అవును. ఆడదే కావచ్చు. ఆధారాలేవీ లేవుగాని కటి ప్రదేశం కాస్త విశాలంగా వుంది. ఈ చెదిరిపోయిన పూసల్ని మగాళ్లు కూడా వేసుకుంటారు. అయితే గాజులు మాత్రం తొడగరు. అందుకే మూడొంతులు యిది ఆడదై వుండాలి" అన్నాడు.

"మరి యిక్కడెందుకుంది?"

"ఏమో."

చాలాసేపు అక్కడే వుండి దాన్నిగురించే చర్చించుకుంటూ బయలుదేరారు. కొద్దిదూరం వెళ్ళాక అలసిపోయి నడవలేక ఒకచోట కూర్చుండి

పోయాడు సత్యం అలసట తీర్చుకుందామని. శివం కాలవలో ముఖం కడుక్కొస్తానని వెళ్ళాడు.

సత్యం ఓ మారు పుస్తకం తిరగేశాడు. అస్థిపంజరం స్కెచ్ తీశాడు. దాని చుట్టూ మాంసం, శరీరం, జుట్టు, కళ్ళు, ఒక్కొక్క భాగం గీశాడు. ఇరవై యేళ్ళ కోయపిల్ల నగ్నంగా పడుకుంది. బట్ట లేదు. ఇంత అందంలోనూ ఎంత భయం దాక్కుంది! అందాన్ని ఒలిచేస్తే అడుగున కనిపించేదేమిటి?—— వికృతంగా, భయంకరంగా అస్థిపంజరం!

దామెర్ల రామారావు చిత్రాల్లోని 'అమాయిక'లా వుంది. పాపం! అంత అందమూ ఎలా పనికిరానిదిగా నాశనం అయిపోయిందో! సృష్టి దాన్ని నాశనం చేసింది. ఎండా, వానా, గాలీ కలిసి సౌందర్యాన్ని పీల్చి పిప్పిచేసి వదిలిపెట్టినట్టుగా ఎముకల్ని వికృతమైన రూపాన్నీ విడిచిపోయాయి. సృష్టిలోనూ పరస్పరం ఒకదానిమీద మరోదానికి ఎంత కసి! ఎంతకోపం! అందాన్ని మరో అందం అంతంచెయ్యాలనే తుదివరకూ ప్రయత్నం!

బలంగా పిక్కలు తేలిన శరీరం, ఎత్తుగా ఉబికిన వక్షాలు, లైట్ అండ్ షేడ్‌లో చిత్రానికి పరిపూర్ణతనిచ్చే వంపులు తిరిగిన ఆకారం—— నిజంగా ఆమెను మోడలుగా పెట్టుకుంటే చిత్రాల్లో ఎంత నిండుదనంవుంటుంది! అలాటి స్త్రీని బొంబాయి జే. జే. స్కూల్లో నిలబెడితే వందలాది ఆర్టిస్టుల చేతులు ఎంత వాస్తవాన్ని అలవరచుకుంటాయో!

శివం వచ్చాడు. బొమ్మను చూసి ఆశ్చర్యపోయాడు. "ఎంత అందంగా వుంది! నిజంగా యిదే మనిషయితే, చలం దీన్ని చూసివుంటే, అమాంతం ఎంత మందిలోవున్నా లాక్కుపోడూ. మళ్ళీ దీనిమీద రెండొందల పేజీల పుస్తకం రాయడూ. ఇలాటి నిర్జన ప్రదేశంలో కావ్యాన్ని సృష్టించడానికి యీమె కథానాయిక అయివుండేది. ఈ ప్రదేశానికంతటికీ ఒక ప్రత్యేకతనీ, ఎవరూ మర్చిపోలేనంతటి విశిష్టతనీ చేకూర్చివుండేది. ఈ చుట్టూరా వున్నజింక పిల్లలకు, పక్షులకు, కాలవనీళ్ళకు, కొండరాళ్ళకు, గడ్డి దుబ్బులకు పనికలిగించేది. వాటిని కదిలించి గిలిగింతలు పెట్టేది. కాని చిత్రం! ఇప్పుడు ఆమె అందాన్నీ, శక్తినీ నాశనం చేసిపారేశాయి కొన్ని శక్తులు. దానిమీద కసి కొద్దీ ఎందుకూ పనికిరానిదానిలాగ, చూస్తే భయపడి పారిపోయేట్టుగా వికృత పరిచి, దాన్ని జయించామన్న విజయగర్వంతో ఆనందంగా దానిచుట్టూ విలయనృత్యం చేస్తు

న్నాయి గాలీ, ఎండా. ఇంకొద్దిసేపట్లో నేనూ వస్తున్నానన్నట్టు దొంగ చూపులు చూస్తోంది కారుమేఘం ఒకటి కొండ శిఖరం మీదనుండి. ఆ మూడింటివల్లా ప్రకృతి ఎలా సృష్టించబడుతుందో అలాగే నాశనమూ అవుతుంది. ఒకే వస్తువు మంచికీ, చెడుకీ ఉపయోగించబడినట్లే ఆ మూడుశక్తులూ ప్రకృతి పుట్టుకకూ, నాశనానికీ ఉపయోగపడతాయి. అంత అందమైన శరీరాన్నీ, రక్తమాంసాల్నీ అవి మూడూ పురుగులు ఏరుకు తిన్నట్టుగా తినేశాయి. ఎముకల పోగు మిగిలింది. దానివల్ల ఉపయోగం ఏమిటి? కొన్నాళ్ళకది మట్టిలో కలిసిపోతే అందులోనుంచి చిన్న మొక్క లేచి నుంచుంటుంది అందులో ఎరువు వుందిగనుక. అంతే"

"అసలు, ఆమె ఎందుకు చనిపోయింది?"

"ఏమో.... ఏమో"

ఇద్దరికీ జవాబు తెలీదు. ఆలోచించుకుంటూ యిల్లు చేరుకున్నారు.

రాత్రి భోంచేశాక అంతా కలిసి కూచున్నప్పుడు శర్మతో తాము చూసిన అస్థి పంజరం గురించి చెప్పారు. "సరే, రేపు జీపులో వెళ్ళినప్పుడు అదీ చూద్దాంలే." అన్నాడు శర్మ.

అనుకున్నట్టుగానే ఆ మర్నాడు జీప్‌లో బయలు దేరారు. మళ్ళీరావడం సాయంకాలమే. అవసరమైన పెట్రోలు, తినటానికి ఫలహారాలు వెంటేసుకుని బయలుదేరారు. ఈసారి కారుని డ్రైవరే నడుపుకొస్తున్నాడు. సత్యం, శివంలు వెనకసీటులోనూ, శర్మ ముందు సీట్లో డ్రైవరు పక్కనా కూచున్నారు.

మధ్యాహ్నం వరకు జీపుమీద తిరగగలిగినంత దూరం తిరిగి భోజనం చేసే సమయానికి సరుగుడు చెట్లకింద జీపును ఆపి, తెచ్చుకున్న ఫలహారాల్ని కాళీచేశారు. అక్కడికి దగ్గర్లోనే చిన్న వాగు వుంది. నీళ్ల తేవడానికని డ్రైవరు వెళ్ళి చల్లగా వున్నాయంటూ స్నానం చేసి వచ్చాడు. రెండింటివరకూ చెట్లకింద నీడల్లో కబుర్లు చెప్పుకుంటూ కూచున్నారు. కాస్సేపు పేకాట ఆడుకున్నారు.

ఎండ కొద్దిగా తగ్గినతర్వాత అస్థిపంజరం చూసొద్దామని బయలు దేరారు. కాలవ వడ్డు వెంబడే వెళ్తే రెండుమైళ్ళన్నా ప్రయాణం చేయాలి. అడ్డదారిని పుంతలు, మెట్టలు దాటుకుంటూపోతే మైలు దూరంలోనే తగులుతుంది. ఫరవాలేదులెండని అడ్డదారినే పోనిచ్చాడు డ్రైవరు. అరమైలు వెళ్లే

సరికి యింజను ఆగిపోయింది. ముగ్గురూ దిగి తొయ్యడం ప్రారంభించారు. అయినా ఇంజన్ స్టార్ట్ కాలేదు. డ్రైవరు దిగి బాగుచేయడం ప్రారంభించాడు. మిత్రులు ముగ్గురూ జీపుదిగి, అవతల కనిపిస్తోన్న చింతచెట్టు దగ్గరికొచ్చారు.

దాని మొదల్ని చూసి ఆశ్చర్యపోయాడు శివం. దాని చుట్టుకొలత పది బారలైనా వుంటుంది. సత్యం అంతవరకూ పెన్సిలుకు పని చెప్పలేదేమో గబగబా నాలుగు లాండ్‌స్కేప్ స్కెచ్‌లు గీసుకున్నాడు. ఈలోగా శివం, దగ్గరలోని మెట్టయెక్కి ఫర్లాంగు దూరంలో నిటారుగా నుంచున్న కొండ శిఖరాన్నీ, మీద మేతమేస్తున్న మేఘాల గుంపుల్నీ, అడుగున చుట్టూరా దట్టంగా పెరిగిన పచ్చని మద్దిచెట్లనీ ఫొటో తీసివచ్చాడు. చింతచెట్టు కిందికొచ్చి కూర్చున్నారు.

శర్మ సిగరెట్టు వెలిగించి మిగిలిన యిద్దరకూ చెరోటి యిచ్చి వాళ్ల పక్కనే కూచున్నాడు. సిగరెట్టుపొగ మెలికలు తిరుగుతూ వాళ్ళ చుట్టూరా అల్లుకుని గాలిలో కరిగిపోతోంది. పిల్లగాలులకు కొమ్మలూరెమ్మలూ ఊగు లాడుతున్నాయి. చెట్టుమొదట్లో అరడుగు ఎత్తున పెరిగిన పచ్చగడ్డి వెల్వెట్ గుడ్డలా గాలికి కదిలి మెరుస్తోంది.

శివం కొద్దిగా దగ్గాడు. నిశ్శబ్దం చెదిరింది. గొంతు సవరించుకుని అడిగాడు. "శర్మా! ఇక్కడ నీకు ఎలాటి చిత్రమైన అనుభవమూ జరగలేదూ?"

సత్యం కూడా తన మనసులో అదే ప్రశ్న వున్నట్టు శర్మ వైపు చూశాడు.

శర్మ తల పంకించాడు. పంకించాడేకాని ఏమీ మాటాడలేదు.

మిత్రులిద్దరూ ప్రశ్నలు తగిలించుకున్న ముఖాలతో ఆతన్నే చూస్తు న్నారు. శర్మ సిగరెట్టు ఆఖరిదమ్ము గట్టిగా పీల్చి దాన్ని అవతలకు విసిరేశాడు.

"జరిగింది. జీవితంలో మర్చిపోలేని చిత్రమైన అనుభవం జరిగింది. కాని మీకు చాలా హాస్యాస్పదంగా వుంటుందేమో. నవ్వుకుంటారు కూడాను." సాలోచనగా యిద్దరి ముఖాల్లోకి చూశాడు శర్మ.

"ఫర్వాలేదు చెప్పు" అన్నట్టుగా యిద్దరూ అతనివైపే తిరిగి కూర్చున్నారు.

ఆయన మెల్లగా చెప్పడం ప్రారంభించాడు.

ఒక రోజు - అంటే యీ ప్రాంతానికి వచ్చిన ఓ నెల్లాళ్ళకు - ఒక రోజు ఒక్కడ్నీ కాలినడకన బయలుదేరాను పరిసర ప్రాంతాల్ని చూద్దామని. చెట్లని, గట్లని, పక్షుల్ని చూస్తూ వెళ్తున్నాను. ఒక కొండ ఎక్కి దిగుతుండగా కాలు జారింది. నాలుగడుగులు కిందకు జారి-ఓ తుప్పను పట్టుకుని లేచాను. కొండకింద ఎవరో పకపకా నవ్వుతున్నారు. చాలా గట్టిగా ఆ చుట్టూ ప్రతిధ్వనించింది.

కిందకు చూశాను.

ఎండిన చితుకుల్ని ఏరుకుంటోన్న కోయపిల్ల పకపకా నవ్వుతోంది నన్ను చూసి. మరొకామె చితుకుల మోపు బిగించి కడ్తోంది. మారుమాట్లాడకుండా కొండదిగి వాళ్లవైపన్నా చూడకుండా ముఖం చిట్లించుకుని వెళ్ళిపోయాను. ఫర్లాంగు దూరమన్నా వెళ్ళకముందే వర్షం ప్రారంభించింది. కుండపోతగా వాకటే వర్షం! కొండల మీదనుండి పాముల్లా పరిగెత్తుకొస్తున్నాయి నీళ్లు. అగాధాలూ, కొండ దిగుడులూ సెలయేర్ల ప్రవాహంతో నిండిపోయాయి.

చెట్టుకింద నుంచున్నాను నేను. వర్షం బొట్లు బొట్లుగా ఆకుల మీద నుండి జారిపడుతోంది. బట్టలు తడిసిపోయాయి. చలివేస్తోంది. శీతగాలికి వేళ్లు వంకర్లు తిరిగిపోతున్నాయి. సిగరెట్టు వెలిగిద్దామనుకున్నాను. అగ్గిపెట్టె తడిసిపోయింది. వెలగడంలేదు. చలికి వణికిపోతూ నుంచున్నాను.

ఇందాకటి కోయవాళ్లు మోపులు ఎత్తుకుని వచ్చారు. వర్షంలో పూర్తిగా తడిసిపోయారు. వచ్చి, ఆ చెట్టుకిందే మోపుల్ని దించి నుంచున్నారు.

తిన్నగా వాళ్ళను చూడలేకపోయాను. పల్చటి గుడ్డముక్క వక్షాల్ని కప్పుతోంది. వర్షానికి తడిసి శరీరానికి అంటుకుపోయింది. గుండ్రని ఉబికిన వక్షాలు పల్చటి గుడ్డ పొరను చీలుస్తున్నాయి. మనం ఏది సంస్కారమనుకుంటున్నామో ఆ సంస్కారం అక్కడలేదు. స్వేచ్ఛగా గాలికి వానకి వదిలిపెట్టారు

వాళ్లు. ఈ కాలపు నాగరికత అనే నీతిలో అనాగరిక జీవితాలు ఎలా ప్రతి ఫలిస్తున్నాయో ఆలోచిస్తే-మానవుడి పురోగతి నిజంగా పురోగతికాదు. అది మళ్ళీ పాతదాన్ని చేరుకోవడమే.

అడవిజాతివాళ్లు అనాగరికులు, వాళ్ళకు సిగ్గు అనేదిలేదు, గోప్యంగా శరీరభాగాల్ని దాచుకోవడం తెలీదు అంటుంది నాగరిక ప్రపంచం. అదే నిజమయితే, వాస్తవాన్ని ఆలోచిస్తే, యీనాటి నాగరీకుల్ని నిజంగా నాగరీకు లనలేం. శరీరం సాధ్యమైనంత ఎక్కువగా కనపడేలా వస్త్రాల్ని ధరించడం యీనాటి నాగరికత. ఒకనాడు ఏది అనాగరికమూ, సంస్కారముకానిదీ అయిందో అదే యీనాడు సంస్కారమనిపించుకుంటోంది!

పడవ బయలుదేరిన చోటికే మళ్ళీ వచ్చి చేరుతుంది. అనాగరికత నుండి బయలుదేరిన నాగరికత చుట్టు తిరిగి చివరకు అనాగరికతలోకే వెళ్తోంది. ఈనాటి సంస్కారిత నాగరికతను ధైర్యంగా, ఆనందంగా కళ్లను యింతింత చేసుకుని చూస్తుంటాం. అదో ఆకర్షణ! అదే ఆకర్షణ అనాగరిక జాతుల్లోనూ, సంస్కారం సభ్యత తెలీని కొండజాతి వారిలోనూ ఎందుకుండదు?

అలానే నుంచుని సంస్కారం కాని చూపుతో తడిసిన వాళ్ల భాగాల్ని చూస్తున్నాను. తీక్షణంగా చూసే శక్తిలేదు. మనసు వికలమై దగ్గరగా కుంచిం చుకుపోయి ఒకమూల ముద్దగా పడిపోయింది. దృష్టి మార్చుకుని పక్కకు తిరిగి ఎటో చూస్తున్నాను. వాళ్లు నవ్వుకొంటున్నారు. గుసగుసలాడుకొంటు న్నారు. మాటలు వినిపిస్తున్నాయి గాని స్పష్టంగాలేవు.

వర్షం తగ్గిపోయింది. మబ్బులు మాత్రం యింకా వేలాడుతూనే వున్నాయి. పిల్లకాలువల్లో నీటి ప్రవాహపు వొరవడి తగ్గింది. మెల్లగా పాకుతూ వెళ్తున్నాయి నీళ్లు.

వర్షం తగ్గడంతోనే వాళ్లు వెళ్లిపోయారు. ఆ వెనుకనే నేనూ బయలు దేరాను. కొండ ఎక్కాను, దాటి వెళ్లిపోదామని. వాళ్లు మెల్లగా కొండకింద సన్నని బాటలోంచి వెళ్తున్నారు. ఒకామె పాడుతోంది ఆ పాటకు ఒక వరసేం వున్నట్టులేదు. ఆ మాటలు గాని, భావంగాని తెలీడంలేదు. కాని ఆ పాటలో బరువుంది. కంఠంలో శ్రావ్యతవుంది. అది హృదయాన్ని పగ్గాల్లా పట్టివేసింది. గాలిలో కలిసి ఎగురుతోంది. రాళ్లల్లొ మారు మ్రోగుతోంది.

వాళ్ళు చూపునుండి దాటిపోయేవరకూ అలానే నుంచున్నాను. వాళ్ళు వెళ్లి వెళ్లి చెట్ల కొమ్మల్లో, ఆకుల గుబురుల్లో కలిసిపోయారు. వాళ్ల దృష్టి నుండి తప్పుకున్న అయిదు నిమిషాల వరకు యింకా పాట వినిపిస్తూనేవుంది. సాయంకాలం ఆఖరి వెలుతురు చారలు క్రమక్రమంగా చీకటిలో కలిసిపోయి నట్టుగా నిశ్శబ్దంలో కరిగిపోయింది పాట.

మెల్లగా కొండదిగి వెళ్ళిపోయాను. అప్పటినుండి రోజూ సాయంకాలం పూట షికారుగా ఆ కొండమీదకువచ్చి కూర్చోవడం అలవాటైంది. కొండ కింద బాటలోంచి చితుకుల మోపుల్ని ఎత్తుకొని ఆ యిద్దరూ రోజూ అటే వెళ్లే వారు. అందులో ఒకామె తరచూ పాడుతూనే వుండేది. గట్టిగా, ఆ రాళ్లలో ప్రతిధ్వనించి, అలలు అలలుగా తెరలు తెరలుగా ఆపాట వినిపిస్తూనే వుండేది. అక్కడి వాళ్లతో పరిచయం అయ్యేకొద్దీ, వాళ్ల మాటలు, వాళ్ల ఉచ్చారణ క్రమంగా అర్థమవుతూ వచ్చాయి. ఆమె పాడే పాటలకు కొద్ది కొద్దిగా అర్థం తెలుస్తోంది. మామూలుగా ఆ వయసులోని స్త్రీల హృదయా లలో నాటుకునే భావాలూ, కోర్కెలే ఆమె పాటలకు యితివృత్తాలు. అవి వాళ్ల జానపద పాటలు.

రోజూ నా దినచర్యలో ఒక భాగం సాయంకాలం పూట ఆ కొండ దగ్గరకు వెళ్లి కూచోడం. అలా అర్ధ సంవత్సరం గడిచిపోయింది.

వరుసగా ఒక వారం రోజులపాటు వాళ్లు కనిపించలేదు. ఆశ్చర్యం వేసింది. ఆ ప్రకృతీ, చెట్లూ, కొండలూ, రాళ్లూ, నీళ్లూ, పిల్లగాలులూ, సన్నని బాటా, నేనూ చిన్నబోయినట్టయ్యాయి. ఎనిమిదోరోజు కొండదిగి గూడెంలోకి బయలుదేరాను. గూడెంలో చాలా హడావుడిగా వుంది. గూడెం వెనక మైదానంలాటి చోట జనం గుమిగూడి వున్నారు. పిల్లలూ, పెద్దలు, ఆడాళ్ళూ మగాళ్ళూ చేరి డప్పులు కొడుతూ, దొప్పలతో కల్లు తాగుతూ, అరుస్తూ, పాడుతూ, గెంతుతూ హుషారుగా, సందడిగా కనిపించారు. చీకటిలో స్పష్టంగా ఆకారాలు తెలీడంలేదు. ఒకచోట మాత్రం చిన్న మంట వెలుగు తోంది.

ఆ మంటకు కాస్త దూరంగా చిన్న గుంపు వుంది. వాళ్ళ మధ్య ఒక జంట వుంది. కొత్తగా పెళ్ళయినట్టు వాళ్ళ ఆకారాలు చెప్తున్నాయి. మెళ్ళో

పూసలు, వొంటిమీద రంగు రంగుల గుడ్డ పీలికలు, మొఖంనిండా గీతలూ బొట్లూ కనిపిస్తున్నాయి. వాళ్ళిద్దరికీ కలిపి పెళ్ళి చేసిన పెద్దలు వాళ్ళను వదిలి మస్తుగా తాగి తూలుతున్నారు!

ఆ మంటముందు నుంచునివున్న పెళ్ళి కూతురు నాకూ, నా సాయం కాలపు ప్రకృతికీ అందాన్నీ, ఆనందాన్నీ యిచ్చి రాగంతో ఆకాశాన్నీ, భూమినీ కలిపి అక్కడి రాళ్ళనీ, లోయనీ కదిలించే ఆడది! ప్రతి సాయం కాలం నా ముందు లోయలో వంకరటింకర బాటలో మోపెత్తుకుని వెళ్ళే కోయపిల్ల!

వాళ్ళ ఆచారాల్ని చూసి నవ్వుకుని వెళ్ళిపోయాను.

ఆ తర్వాత మళ్ళీ ఎప్పుడూ సాయంకాలంపూట ఆ కొండల్లో ఆమెపాట వినలేదు. ఆమెతో వచ్చే మరో కోయపిల్లకూడా అలా వెళ్ళేదికాదు. చిన్నబోయి నట్టు వుండేది ఆ ప్రదేశం. ఒకరకమైన పద్ధతికి అలవాటుపడిపోయాక, ఆ పద్ధతి మారిపోతే మనసు కొంతకాలం వరకూ అదోలా వుంటుంది. నేనూ అలాటి స్థితిలోనే కొంతకాలం వున్నాను. మళ్ళీ మెల్ల మెల్లగా, నా గొడవలో మునిగిపోయి క్రమ క్రమంగా మర్చిపోయాను.

నాలుగైదు నెలలు గడిచాయో లేదో ఒకరోజు సాయంకాలం డిస్పె న్సరీలో కూచుని వుత్తరం రాసుకుంటున్నాను. బండిదిగి యిద్దరు మనుషులు ఒక కోయవాడిని లోపలికి తీసుకొచ్చారు. ఒంటినిండా, బట్టలనిండా రక్తంతో చేతులకు, తలకు అప్పటికప్పుడు గుడ్డ పీలికలు చించికట్టిన కట్లున్నాయి. ఆ కట్లను తప్పించుకుని రక్తం చిమ్ముతోంది.

ఆనందం వచ్చాడు. అడవిలో చెట్లనుపాడి, కలపను కోయించి దిగువకు పంపిస్తుంటాడు ఆనందం. అతను వస్తూనే చెప్పాడు—కలప కొట్టిస్తుంటే ఓ పెద్ద కొమ్మ విరిగి మీదపడిందని. ప్రమాదం ఎలా జరిగిందీ ఆనందం వివ రంగా చెప్పి "కాస్త ప్రాణం పోకుండా చూడండి డాక్టరుగారూ, ఏ మాత్రం పీడప్రాణం గుటుక్కుమన్నా యీ వెధవలు నన్ను ఒక పట్టాన వదలరు" అన్నాడు.

నిజానికి అతని పరిస్థితి చాలా ప్రమాదకరంగా వుంది. తలమీద తగిలిన గాయం పెద్దదే. కుడిచెయ్యి పూర్తిగా పిప్పి పిప్పి అయిపోయింది. ఆ పరిస్థితుల్లో "ప్రయత్నిస్తాను" అని అనడంకన్న మరే ధైర్యమూ చెప్పలేక పోయాను. ఆనందం కాస్సేపు వుండి, మళ్ళీ పొద్దున్న వొచ్చి కలుస్తానని చెప్పి వెళ్ళిపోయాడు.

చీకటిపడే వేళకు పాతికమంది కోయవాళ్ళు పరుగెత్తుకొచ్చారు. ఒకావిడ ఏడుస్తోంది. గట్టిగా గుండెలు బాదుకుంటూ ఒకటే ఏడుపు. వచ్చినవాళ్ళంతా అరుగుచివర చీకట్లో నుంచున్నారు. ఆకారాలు కనిపించడంలేదు. బహుశా ఆ ఏడుస్తున్నామె అతని భార్య అయివుంటుంది.

వచ్చినవాళ్లు ఓమారు అతన్ని చూసి, చాలాసేపు బయట వరండాలోనే కూచుని వెళ్ళిపోయారు. అంతా వెళ్ళిపోయాక భోజనం చేసి నిద్ర పోయాను. మధ్యలో తెలివి వచ్చింది. బయటి నుండి ఎవరో స్త్రీ సన్నగా ఏడుస్తోన్న శబ్దం వినిపిస్తోంది. ఆనిశ్శబ్దంలో మందంగా కదులుతోన్న గాలిలో అలలు అలలుగా ఎగురుతోంది. ఆ ప్రదేశంలోని ప్రతి అణువునూ కదిలించి వేసేట్టుగా వుంది ఆ శబ్దం. పాపం! తెల్లవార్లూ ఆమె అలా ఏడుస్తూనే వుంది గాబోలు, నేనుమాత్రం కొద్దిసేపట్లోనే తిరిగి నిద్రపోయాను. ఆ కొద్దిసేపూ ఆమె ఆవేదన నాలోనూ జాలినీ, సానుభూతినీ లేపివెళ్ళింది. అది మామూలే. కాకుంటే డాక్టర్లు కావడం అనవసరం. మళ్ళీ అన్నీ మర్చిపోయి హాయిగా నిద్రపోయాను.

ఉదయంలేచి అరుగుమీదకు వచ్చాను. ఆ ఆడమనిషి యింకా అక్కడే కూచునివుంది. మోకాళ్ళలో తలదూర్చి ఏడుస్తోంది. నన్ను చూడగానే లేచి బిత్తరచూపులు చూస్తూ నుంచుంది. దుఃఖం ఆపుకోలేక ఒక్కసారిగా గొల్లున ఏడ్చేసింది.

ఆశ్చర్యపోయాన్నేను. ఆమెను చూస్తూ కొద్దిసేపు అలానే నిలబడి పోయాను. తన కదలికతో, రాగంతో కొంతకాలం క్రితం ప్రకృతికీ, నాకూ, నా చుట్టూ తిరిగే ఊహలకూ, నా ఆనందానికీ కారణమైన కోయపిల్ల! ఎంతో అందంగా, నిండుగా వుండే ముఖంలో సిరాశారేఖలు తూరుపు చారల్లా నలు వైపులకూ పరుగెత్తుతున్నాయి. ఆమె ఏమిటో అడుగుతోంది. సరిగా వినిపిం

చదంలేదు. ఆ కంఠంలో పూర్వపు మాధుర్యం లేదు. ఆమె కళ్లలో వెనకటి జ్యోతుల్లేవు. చాలా దీనంగా చూస్తోంది. ఆ చూపుల్లోని ఆవేదన ములుకుల్లా గుచ్చుకుంటున్నాయి నన్ను. ఆమెకు ధైర్యంచెప్పి యింటికి పంపించేశాను. ఆమె వెళ్ళిపోయిన చాలాసేపటి వరకూ మనసు అదే ఆలోచిస్తూ వుండి పోయింది. ఏమయినా అతను జీవించాలి!

అలానే జీవించాడు. చాలా రోజులు కష్టపడి అతి జాగ్రత్తగా వైద్యం చేయగా మళ్ళీ మామూలు మనిషై లేవగలిగాడు. అయితే కుడిచేతిని మాత్రం మోచేతి కీలువరకూ తీసెయ్యాల్సి వచ్చింది. అతన్ని యింటికి పంపించేరోజున ఆమె వచ్చింది, కూడా ఓ అయిదారుగుర్ని వెంటబెట్టుకుని. వాళ్ళు వెళ్ళిపోతు న్నప్పుడు ఆమె ముఖంలో ఎప్పుడూ చూడనంత ఆనందం గట్టుతెగి పొర్లి పొంగింది. సర్దాగా కబుర్లు చెప్పుకుంటూ కాలవగట్టు వెంబడే వాళ్ళు వెళ్ళి పోయారు.

వారంరోజుల తర్వాత ఒక్కడ్నే జీపుమీద వస్తున్నాను. ఆ చుట్టుపట్ల నాలుగైదు గూడెంలు తిరిగి, అప్పటికే చాలా ఆలస్యమైపోయిందని కాలవ పక్కబాటమీద నుండి జోరుగా పోనిస్తున్నాను. బాటకు దగ్గర్లో గుట్టమీద నుండి ఎవరో అరుస్తున్నారు. వెనక్కు తిరిగి చూశాను. ఆవిడే, అదే కోయపిల్ల! జీపు ఆపాను. పనసపండొకటి మోసుకొచ్చి జీపులో పెట్టింది. ఆ తర్వాత నా ఎదురుగా రెండు నిమిషాలు మౌనంగా నుంచుని చెంగు చెంగున దూకుతూ రాళ్లనీ రప్పల్నీ, తుప్పల్నీ దుబ్బుల్నీ తప్పించుకుంటూ గుబురుల్లో మాయ మయింది.

ఆ తర్వాత రోజున అలా వెళ్ళాలనిపించింది. జీపుమీద కాకుండా కాలినడకనే ఆ రెండు మైళ్ళూ నడుస్తూ వెళ్ళాను. కాలవమీదుగా వెళ్ళితే కాల క్షేపంగా వుంటుందని బయలుదేరాను. గతరోజు ఆమె కలుసుకున్నచోటు వరకూ వచ్చాను. గుట్టమీద నుంచుని చూస్తే ఆవల చెట్ల గుబురుల్లో గూడెం కనిపిస్తోంది. చాలాసేపు గుట్టమీదనే కూచున్నాను. ఎవరూ రాలేదు. సాయం సంధ్యలో కాంతులన్నీ కరిగిపోతున్నాయి. ఇంకొద్దిసేపట్లో అక్కడ చీకటి బాహువుల్ని చాస్తుంది.

ఏదో పాట సన్నగా వినిపించింది. ఒట్టి కూనిరాగమే అది. ఒకటో రెండో చరణాలు మాత్రమే. రాగం ఆగిపోయింది. కింద కాలవలో నీళ్ళు కదిలాయి. కడవను నీళ్ళతో నింపుకొని ఎవరో వెళ్ళిపోతున్నారు.

ఆ కంఠం ఎవరిదో నాకు తెలుసు. అంత చక్కదనం ఎవరి కంఠంలో రంగరించిపోశారో, ఎవరి కంఠం చివర్లో రాగం చిగురాకులా వణికిపోతుంటుందో, ఎవరి కంఠంలో సన్నని నొక్కులుంటాయో నాకు తెలుసు.

గబగబా గట్టుదిగి వెళ్ళాను.

నన్నుచూసి ఆశ్చర్యపోయింది. ఓసారి చిత్రంగా నా నఖశిఖ పర్యంతమూ చూసి కదలబోయింది.

"ఇదిగో మాట" అన్నాను.

ఆగింది. నా వైపే ఆశ్చర్యంగా చూస్తూ నుంచుంది.

"ఆపాట మరికాస్త గట్టిగా పాడవ్" అన్నాను.

తలవూపి కదిలింది, కాలి అందెలను టిక్కుటిక్కు మనిపించుకుంటూ.

"చూడూ...." పిలిచాను.

చూసింది, అక్కడినించే వెనక్కు తిరిగి.

తల ఊపాను రమ్మన్నట్టుగా

సగం వరకూ వచ్చి ఆగింది.

ఎందుకు పిలిచాను. ఏమో. ఏమీ చెప్పలేను. కాళ్లూ చేతులూ వణుకుతున్నాయి. గుండె గబగబా కొట్టుకుంటోంది. ఏమిటి యిలా అయిపోయాను? నాకే ఆశ్చర్యంగా వుంది.

ఆమె వెళ్ళిపోతోంది.

గబ గబా దగ్గరకు వెళ్ళాను. పర్సులోంచి ఓనోటు తీసి ఆమెచేతికివ్వబోయాను. చిత్రంగా చూసింది.

"చీర కొనుక్కో. ఈసారి సంతకెళ్లినప్పుడు మంచి చీర కొనుక్కో. నువ్వు తొడుక్కున్నదేం బావుండలేదు. ఎర్రగా రక్తంలా వుండే రంగు చీరయితే నీకు బాగుంటుంది" అన్నాను.

చెయ్యివెనక్కు తీసేసుకుంది. గబ గబా అక్కడ్నించి వెళ్ళిపోయింది.

నాకక్కడ నిలుచోడానికి భయంవేసింది. నామీదనాకే అసహ్యం వేసింది. అక్కడ్నించి వొచ్చేశాను.

మళ్ళీ అటువైపు వెళ్ళలేదు. సాయంకాలంపూట బంగళావదిలి బయటికి వెళ్ళడం కూడా మానుకున్నాను. నామీద నాకే తక్కువభావం, మాటి మాటికీ చికాకూ, అసహనం కలుగుతున్నాయి.

ఒకరోజు సాయంకాలం ఒక్కడ్నే గదిలో కిటికీముందు కూచుని వర్షాన్ని చూస్తున్నాను. నాలుగురోజులుగా కుండపోతగా ఒకటే వర్షం. మంచుపొరలు ఆకాశాన్నీ భూమినీ కప్పేసినట్టుగా వర్షపు తెరల్లో ప్రకృతిని చుట్టేసినట్టుగా వుంది. కనుచూపు మేరంతా నిర్జీవంగావుంది. ఒక్క పక్షికూడా ఎక్కడా ఎగరడంలేదు.

అకస్మాత్తుగా అన్ని శబ్దాల్నీ తప్పించుకుని సన్నగా ఓపాట ఎగిరి వచ్చింది. చాలా కాలానికి మళ్ళీ ఆపాట విన్నాను. అచేతనంగా ఆ పాటనే వింటూ కూచుండిపోయాను. అరగంటయింది. ఇంకా పాట పూర్తికాలేదు. ఏమో....ఎన్నిసార్లు ఆ పాటను ఆమె మళ్ళీ మళ్ళీ పాడుతూ వుందో తెలీదు, గంటయినా ఆ పాట వినిపిస్తూనే వుంది!

కిటికీలోంచి చూశాను. ఎవరూ కనిపించలేదు. మరో అర్థగంట గడిచింది. అయినా పాట ఆగిపోలేదు. పాడిందే మళ్ళీ మళ్ళీ పాడుతోంది. వర్షంలో గొడుగేసుకుని పాట వినిపిస్తున్న వైపుగా బయలుదేరాను.

రెండు ఫర్లాంగుల దూరంలో ఓబండమీద ఎవరిదో ఆకారం కదిలింది. దగ్గరకు వెళ్ళాను. ఆవిడే. కోయపిల్ల! వర్షంలో తడుస్తూ నుంచుంది. దూరం నించే నన్ను చూడగానే పాట ఆపి చప్పట్లు కొడుతూ, పైమీద వల్లెవాటుగా వేసుకున్న గుడ్డపీలికను తీసి గాలిలో ఆడిస్తూ తన వునికిని తెలియజేసింది.

దగ్గరకువెళ్ళాను. ఏమిటో చెప్పాలనిఅనుకుంటున్నట్టుంది.కాని మాటలు పెగలడంలేదు. రెండు చేతుల్నీ దగ్గరగా గుండెల్లోకి ముడుచుకుని పాదాల్ని చూసుకుంటూ నుంచుంది. ఆమె వళ్లంతా వణికిపోతోంది. ఆ పెదాలు మరీనీ. బహుశా వర్షంలో తడుస్తూ వుండడం చేతనేమో.

తలమీద నుండి వర్షపు నీరు కారి వక్షాలమీద పడుతోంది. తడిసిన వస్త్రాల్లోంచి శరీరం అక్కడక్కడ బైట పడుతోంది.

ఆ స్థితిలో ఆమెను చూస్తోంటే నా మనసు స్వాధీనం తప్పిపోతోంది! అచేతనంగా పడివున్న కోర్కెలు అనుభవాల కోసం ఎదురుచూస్తూ ఉవ్వెత్తున పైకి లేచాయి. చుట్టూ చెట్లూ రాళ్ళూ, రాళ్ళపక్కన పాకుతున్న నీళ్లు, చెట్ల పలవల్లో జ్ఞానంలేని పక్షులు, పైన చిక్కగా ముసుగు కప్పిన వర్షం, చలితో గజగజా వణికిపోతున్న శరీరాలు!

"ఏమిటి విశేషం?" అన్నాను మరికాస్త దగ్గరకు వెళ్ళి. నా ముఖంలోకి దీనంగా చూస్తూ "డబ్బులు కావాలి" అంది.

"లేవు, ఎలా!" అన్నాను. నిజానికి నా దగ్గర లేవు.

నిరాశగా చూసింది. ఎంత బరువుగా కదిలాయని ఆ రెప్పలు!

"అడు తెమ్మన్నాడు" అంది మెల్లగా. అలా అంటున్నప్పుడు ఆమె కళ్ళల్లో కన్నీరు కదిలింది.

ఏంచెయ్యను, ఎలావున్నవాడిని అలా వచ్చేశాను. జేబులో కానీకూడా లేదు. చిటికిన వేలుకు వుంగరంవుంది. ఎప్పుడో చాలా కాలం క్రితం చేయించినది. దాన్ని తీసిచ్చాను. ఆశగా అందుకుంది. ఒకసారి తన వేలికి తగిలించుకుని గుండెలకు అదుముకుని, చెంగు చెంగున లేడిలా దుముకుతూ పరుగెత్తుకుని పారిపోయింది. స్థబ్దుణ్నయిపోయాన్నేను. కొంతదూరం వెళ్ళి ఆగి వెనక్కి తిరిగింది.

"రావూ?" అడిగాను.

"రేపు" అంది. మళ్ళీ లేడిలా దుముకుతూ మాయమైంది.

అంతే. ఆమె మళ్ళీ రాలేదు. ఆమె పాట మళ్ళీ నేను వినలేదు. ఆమె మోసం చేసిందా? ఏమో చెప్పలేను. కాని, యిక్కడి వాళ్ళకు మోసం, కృత్రిమత్వం, ఈర్ష్య అనేవి తెలీవు. ఆమెను గురించి గట్టిగా వాకబు చేసే ధైర్యం లేక ఆషామాషీగా తెలుసుకోవాలని చూశానుగాని అంతగా పట్టించుకున్నవాళ్ళే లేకపోయారు. యధాలాపంగా ఒకరిద్దర్ని అడిగితే ఆమె ఏమయిందీ తెలీదన్నారు. అంతకన్న ఎక్కువగా అడగలేక మాట్లాడక వూరుకుండిపోయాను.

ఇప్పటికీ ఆమె ఏమయిందో తెలీదు"

శర్మ చెప్పడం ముగించి సిగరెట్టు తీశాడు. సత్యం, శివంలు చిన్నగా నవ్వుతూ మిత్రుడ్ని చూశారు.

ఇంకో పదినిమిషాల్లో డ్రైవరు వచ్చి జీపు బాగయింది రమ్మన్నాడు. పదండంటూ బయలుదేరారు ముగ్గురూ. జీపులో చాలా చోట్లకి వెళ్ళారు. ఫోటోలు తీసుకున్నారు. సత్యం స్కెచ్‌లు గీసుకున్నాడు. తిరిగి వచ్చేటప్పుడు అస్థి పంజరం వున్న లోయ దగ్గర ఆగారు. జీపు తిన్నగా లోయ ముఖం వద్ద ఆగింది. ముగ్గురూ దిగి లోయలోకి నడిచారు. అస్థి పంజరాన్ని చూశారు. శర్మ దాన్ని అటూ యిటూ తిప్పి పరీక్షగాచూసి "ఇది ఆడదే" అన్నాడు. "హాస్పిటల్లో పెట్టుకోడానికి బావుంటుంది" అని చెప్పి డ్రైవరు సాయంతో దాన్ని జీపులో పెట్టించాడు.

ముగ్గురూ అక్కడి రాళ్ళమీద చాలాసేపు కూచున్నారు. అడవి వింతలు చాలా చెప్పుకొచ్చాడు శర్మ. విదేశంలో వున్నప్పుడు భయంకరమైన వేట అనుభవం చెప్పి భయపెట్టాడు.

చీకటి పడకుండానే బంగళా చేరుకుందామని లేచారు. శివం కాలికేదో గట్టిగా తగిలింది. మట్టిని తొలగించాడు. బంగారపు ఉంగరం!

శర్మా, సత్యం మాట్లాడుకుంటూ ముందు నడుస్తున్నారు- బహుశా ఆ అస్థి పంజరం ఏ నీళ్ళలోనో అక్కడికి కొట్టుకొచ్చి వుండాలి అనే నిర్ణయానికి బలాన్ని వెతుక్కుంటూ.

శివం మెల్లగా ఆ వుంగరాన్ని జేబులో దాచుకున్నాడు.

(1959)

★